

దక్షిణాది జిల్లాలకు భారీ వర్ష సూచన

● 12 జిల్లాల కలెక్టర్లతో సీఎం స్టాలిన్ సమీక్ష

అడయార్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): దక్షిణాది జిల్లాల్లో భారీ వర్షాలు కురువనున్నట్లు భారత వాతావరణ చెన్నై ప్రాంతీయ కేంద్రం అధికారులు ప్రకటించారు. దీంతో ముందస్తు చర్యలు తీసుకోవాలని 12 జిల్లాల కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. సచివాలయంలో గురువారం ఉదయం ముఖ్యమంత్రి స్టాలిన్ వర్షాలు కురిసే అవకాశం ఉన్న జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు దురైమురుగన్, ఆర్.చక్రపాణి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం తదితరులు పాల్గొన్నారు. బంగాళాఖాతంలో తూర్పు దిశ గాలుల్లో మార్పు కారణంగా శుక్రవారం నుంచి మార్చి 3వ వరకు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తుండటంతో ఆయా జిల్లాల కలెక్టర్లు ముందస్తు చర్యలు చేపట్టాలని స్టాలిన్ ఆదేశించారు. ఇక వాతావరణ శాఖ చేసిన ప్రకటన ప్రకారం పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. అదే విధంగా శుక్రవారం నుంచి మార్చి ఒకటి వరకు తంజావూరు, పుదుక్కోట, రామనాథపురం, శివగంగై, విరుదునగర్, తేని, మదురై, దిండిగల్, తెన్‌కాశి, తూత్తుక్కుడి, తిరునెల్వేలి, కన్నియాకుమారి జిల్లాల్లో కొన్ని చోట్ల భారీ వర్షం కురుస్తుందన్నారు. ఈ నేపథ్యంలో కోయంబత్తూరు, నీలగిరి, తిరుప్పూర్, తేని, దిండిగల్, తెన్‌కాశి, తిరునెల్వేలి, కన్నియాకుమారితో సహా 22జిల్లాల్లో భారీవర్షం కురిసే అవకాశం ఉంది. భారీ వర్ష సూచన నేపథ్యంలో ముందస్తుచర్యలతో పాటు ప్రజలకు అవసరమైన సహాయ సామగ్రిని సిద్ధం చేసి వుంచుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.



సచివాలయం నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి





కొత్త గృహ సముదాయాలను సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి

రూ.776.51 కోట్లతో గృహ సముదాయాలు

● ప్రారంభించిన సీఎం స్టాలిన్

చెన్నై, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గృహ వసతి నగరాభివృద్ధి శాఖలోని రాష్ట్ర గృహవసతి సంస్థ ఆధ్వర్యంలో రూ.776.51 కోట్లతో నిర్మించిన 1046 పలు అంతస్థుల గృహసముదాయాలు, 464 ప్రభుత్వ సిబ్బంది క్వార్టర్స్‌ను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రారంభించారు. సచివాలయంలో గురువారం ఉదయం జరిగిన కార్యక్రమంలో చెన్నై జిల్లా షెనాయ్‌నగర్‌లో రూ.131.27 కోట్లతో నిర్మించిన 240 బహుళ అంతస్థుల గృహసముదాయాలు, కేకే నగర్‌లో రూ.51.29 కోట్లతో 120 పలు అంతస్థుల నివాసగృహాలు, చెంగల్పట్టు జిల్లా రాజకుళిపేటలో రూ.43.81 కోట్లతో నిర్మించిన 116 నివాస గృహాలు, సొంతింటి పథకం కింద చెన్నై జిల్లా నెర్క్రుండం వద్ద రూ.433.59 కోట్లతో నిర్మించిన 570 బహుళ అంతస్థుల నివాసగృహాలను ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వ సిబ్బంది అద్దె నివాసాల పథకం కింద తిరుచ్చి జిల్లా సెంగుళంలో రూ.116.55 కోట్లతో నిర్మించిన భహుళ అంతస్థుల భవన సముదాయానికి కూడా ఆయన ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఎస్. ముత్తుసామి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందనం, గృహ వసతి నగరాభివృద్ధి సంస్థ అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కాకర్ల ఉష, రాష్ట్ర గృహ వసతి సంస్థ అధ్యక్షుడు పూచ్చి ఎస్.మురుగన్‌న ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జీఎస్ సమీరాన్ తదితరులు పాల్గొన్నారు.

'కలంగరై' పేరుతో 25 డీ అడిక్షన్ సెంటర్లు...

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రులలో రూ.15.81 కోట్లతో 'కలంగరై' పేరుతో సిద్ధం చేసిన 25 డీ అడిక్షన్ సెంటర్లను ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారు. అదే సమయంలో మానసిక వైకల్యంతో ఇళ్లులేని పేదల సంక్షేమం కోసం రూపొందించిన కొత్త విధివిధానాన్ని కూడా ఆయన ఆవిష్కరించారు. అరియలూరు, ధర్మపురి, ఈరోడ్, తిరువారూరు, కృష్ణగిరి, మదురై, చెన్నై, తంజావూరు, నీలగిర, తిరుచ్చి, తిరునల్వేలి, తిరువళ్లూరు, వేలూరు, విల్లుపురం, చెంగల్పట్టు, కోయంబత్తూరు, దిండుగల్, సేలం, తిరువణ్ణామలై, తూత్తుకుడి, విరుదునగర్‌లోని ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రుల్లో డీఅడిక్షన్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు స్టాలిన్ తెలిపారు. వీటితో పాటు నగరంలో గిండీ ప్రాంతంలో ఉన్న కలైంజర్ శతజయంతి ఆస్పత్రి, ప్రభుత్వ స్టాన్లీ ఆస్పత్రి, ఒమందూరార్ ప్రభుత్వ ఆసుపత్రి, కీల్పాక్ మానసిక చికిత్సాలయంలోనూ ఈ కేంద్రాలు నిరుపేద మానసిక రోగులకు, మత్తుకు బానిసలైనవారికి చికిత్సలందిస్తారని చెప్పారు.

వేలూరు, నైవేలి నుంచి చెన్నైకి విమాన సేవలు

● కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు



మీనంబాక్కం ఎయిర్‌పోర్ట్‌లో రెస్టారెంట్ ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి

చెన్నై, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): వేలూరు, నైవేలి నగరాల నుంచి చెన్నైకి త్వరలో విమాన సర్వీసులు ప్రారంభమవుతాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. గురువారం ఉదయం మీనంబాక్కం విమానాశ్రయంలో ప్రయాణికులకు సరసమైన ధరలకు ఆహారపదార్థాలందించేలా ఏర్పాటు చేసిన 'ఉడాన్ యాత్రీ కఫే' రెస్టారెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఆ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ దేశంలోని పెద్ద విమానాశ్రయాలలో నాలుగవదైన మీనంబాక్కం ఎయిర్‌పోర్టులో ప్రయాణికులకు మెరుగైన సేవలు లభిస్తున్నాయని చెప్పారు. రాష్ట్రంలో కోయంబత్తూరు విమానాశ్రయంలో ప్రయాణికుల రాకపోకలు ఎక్కువగా ఉన్నాయని, ఆ విమానాశ్రయాన్ని విస్తరించాలని నిర్ణయించామని తెలిపారు. రాజధాని నగరం చెన్నైలో రెండో విమానాశ్రయాన్ని పరందూరులో ఏర్పాటు చేసేందుకు చర్యలు ప్రారంభించామని, స్థలం ఎంపిక పూర్తయ్యిందని, రెండో దశ పనుల నిర్వహణకు త్వరలోనే ఢిల్లీలో అధికారులతో సమావేశం జరుగనుందని చెప్పారు. రెండు వారాల్లో పరందూరు విమానాశ్రయ నిర్మాణ పనులు ఖరారవుతాయని తెలిపారు. పరందూరు విమానాశ్రయం ఏర్పాటును స్థానికులు వ్యతిరేకిస్తున్నారని, ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వమే తగిన చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. నైవేలి, సేలం, వేలూరు నగరాల నుండి విమానసేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, వీటిలో సేలం - చెన్నై, మధ్య విమానసేవలు ప్రారంభమయ్యాయని, ప్రస్తుతం వేలూరు - చెన్నై మధ్య విమాన సేవలు ప్రారంభం కానుందని చెప్పారు. త్వరలో వేలూరు చెన్నై మధ్య ఉడాన్ పథకం కింద విమాన సేవలు అందుబాటులోకి రానున్నాయన్న మంత్రి రామ్మోహన్‌నాయుడు నైవేలి నుండి కూడా చెన్నైకి విమాన సేవలు ప్రారంభిస్తామన్నారు.

చిరు వ్యాపారులకు ఊరట

● చిన్న కిరాణా షాపులకు వృత్తిపన్ను తగ్గింపు
● గ్రేటర్ చెన్నై మేయర్ ప్రియ



కార్పొరేషన్ సాధారణ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్

ప్యారీస్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ చిరువ్యాపారులకు వృత్తిపన్నులో ఊరట కల్పించారు. పన్ను శాతాన్ని తగ్గించాలనే వ్యాపారుల విజ్ఞప్తి మేరకు చదరపు అడుగు విస్తీర్ణాన్ని బట్టి చిన్న కిరాణా దుకాణాలకు రూ.2300వరకు పన్ను తగ్గించనున్నట్లు జీసీసీ మేయర్ ఆర్ ప్రియా రాజన్ పేర్కొన్నారు. కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం రిప్పన్ భవనంలో గురువారం ఉదయం మేయర్ ప్రియ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ప్రశ్నోత్తరాల సమయంలో కార్పొరేషన్ ఏ మేరకు రుణాలు పొందింది?, దీనికి ఎంత వడ్డీ చెల్లిస్తున్నారో అని బీజేపీ కార్పొరేటర్ ఉమా ఆనంద్ ప్రశ్నించారు. 2004వ సంవత్సరంలో తీసుకున్న రూ.3,63కోట్ల రుణాల్లో రూ.1573కోట్లు తిరిగి చెల్లించామని మేయర్ సమాధానం ఇచ్చారు. తమ వార్డులో బయోగ్యాస్ ప్లాంట్‌లో సంభవించిన ప్రమాదం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురైయ్యారని, ఆ ప్రాంతంలో కొత్త ప్లాంట్ నిర్మానం పనులు జరుగుతున్నాయని, అయితే వార్డు కార్పొరేటర్ అయిన తనను ఇప్పటివరకు కలవలేదని కాంగ్రెస్ సభ్యుడు తీర్థి ఆరోపించారు. జీసీసీ జోనల్ కమిటీ సమావేశాల్లో రెవెన్యూ శాఖ తరుపున అధికారులు హాజరుకావడంలేదని, అదే విధంగా మనలి ప్రాంతంలో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పనులను వేగవంతం చేయాలని జోనల్ కమిటీ ఛైర్మెన్ ఆర్ముగమ్ కోరారు. సమావేశంలో చివరగా పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మేయర్ ప్రియ సమాధానం ఇచ్చారు. కార్పొరేషన్ కమిషనర్ కుమరగురుపరన్ ప్రస్తుతం జీసీసీ విధానంలో ఈ ఫైలింగ్ సిస్టమ్ పరిచయం చేశారని ఇందువల్ల నగరంలోని 15 జోనళ్లలో అన్ని పనులు జాప్యంలేకుండా సకాలంలో పూర్తవుతున్నాయని మేయర్ తెలిపారు. మెరీనా బీచ్, పట్టినంబాక్కం బీచ్ ప్రాంతాల పరిశుభ్రత, సుందరీకరణ పనులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు త్వరలో ఒప్పందం కుదుర్చుకుంటున్నట్లు తెలిపారు.

విచారణకు సీమాన్ గైర్హాజరు

నివాసం వద్ద చింపేసిన నోటీసు ● వాచ్‌మేన్ సహా ముగ్గురి అరెస్టు



నోటీసును చింపుతున్న పార్టీ కార్యకర్త, అరెస్టు చేస్తున్న పోలీసులు

చెన్నై, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): నామ్‌తమిళర్ కట్చి నాయకుడు సీమాన్‌పై నటి విజయలక్ష్మి చేసిన ఫిర్యాదుపై విచారణకు రావా లంటూ పాలవాక్కంలోని ఆయన ఇంటి వద్ద పోలీసులు అతికించిన నోటీసును చింపిన పార్టీ కార్యకర్తను అరెస్టు చేశారు. ఆ సమయంలో గొడవపడిన సీమాన్ నివాసం వద్ద వాచ్‌మేన్‌గా పనిచేస్తున్న మాజీ సైనికుడిని అరెస్టు చేసి, అతడి తుపాకీని కూడా స్వాధీనం చేసుకున్నారు. పెళ్ళిపేరుతో మోసం, లైంగిక వేధింపులు , అబార్షన్ వంటి ఆరోపణలతో విజయలక్ష్మి చేసిన ఫిర్యాదుపై పోలీసులు విచారణ జరిపి 12 వారాల్లోగా నివేదిక సమర్పించాలంటూ హైకోర్టు ఆదేశాల మేరకు వలసరవాక్కం పోలీసులు విచారణ తీవ్రతరం చేశారు. ఆ మేరకు గురువారం విచారణకు రావాలని సీమాన్‌కు సమన్లు పంపించారు. ఆయన తరఫు న్యాయవాదులు పోలీసుస్టేషన్‌కు వెళ్ళి పార్టీ కార్యక్రమాల కోసం బయట ప్రాంతాలకు వెళ్లడంతో హాజరుకాలేకపోయారని, నాలుగు వారాల గడువు ఇవ్వాలని పోలీసులకు వినతిపత్రం సమర్పించారు. ఈ నేపథ్యంలో వలసరవాక్కం పోలీసు లు సీమాన్ నివాసానికి వెళ్ళి శుక్రవారం పోలీసుస్టేషన్‌లో విచారణకు హాజరుకావాలంటూ ఇంటి గోడకు నోటీసు అంటించారు. ఆ సమయంలో ఇంటి వద్దనున్న ఇద్దరు పార్టీ కార్యకర్త లు ఆ నోటీసును చింపేశారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. అదే సమయంలో అక్కడే డ్యూటీ చేస్తున్న వాచ్‌మేన్ కూడా పోలీసులతో గొడవకు దిగాడు. పోలీసులు అతడిని కూడా అదుపులోకి తీసుకుని, అతడి దగ్గరున్న తుపాకీ కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ గొడవ విషయం తెలుసుకున్న సీమాన్ సతీమణి కయల్‌విళి ఇంటి బయటకొచ్చి పోలీసులకు క్షమాపణ చెప్పి ముగ్గురినీ విడుదల చేయమని కోరారు. పోలీసులు తాము చట్ట ప్రకారమే డ్యూటీ చేస్తున్నామని, నోటీసు తమ ముందే చింపటం చట్ట విరుద్ధమన్నారు.

సుప్రీం కోర్టులో అప్పీలు..

ఇదిలా ఉండగా నటి విజయలక్ష్మి ఫిర్యాదుపై విచారణ జరపాలంటూ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వును సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో సీమాన్ అప్పీలు చేయనున్నారని ఆ పార్టీ నాయకులు తెలిపారు. గురువారం విచారణకు హాజరుకాకపోవటంతో శుక్రవారం స్టేషన్‌కు వచ్చి విచారణకు హాజరుకావాలని వలసరవాక్కం పోలీసులు తాజాగా సీమాన్‌కు సమన్ పంపిం చారు. ఈ నేపథ్యంలో సీనియర్ న్యాయవాదులతో చర్చలు జరుపుతున్న సీమాన్ శుక్రవారం సుప్రీం కోర్టులో అప్పీలు చేయడానికి సన్నద్ధమవుతున్నారు.

పారిపోలేదు : సీమాన్...

ఇదిలా ఉండగా పోలీసుల విచారణకు భయపడి తానెక్కడికీ పారిపోలేదని, పార్టీ కార్యక్రమాల్లో బిజీగా ఉండడం వలన కొద్ది రోజుల తర్వాత విచారణకు హాజరవుతానని సీమాన్ తెలిపారు. కృష్ణగిరిలో గురువారం మధ్యాహ్నం ఆయన మీడియాతో మాట్లాడుతూ తన నివాసం వద్ద అనవసరంగా పోలీసులు వెళ్ళి నోటీసు అతికించి గొడవకు శ్రీకారం చుట్టారని ఆరోపించారు. తనను అవమానించాలని కుట్రపన్నిన డీఎంకే ప్రభుత్వం పోలీసులతో అవనసర తగాదాలు సృష్టిస్తోందని విమర్శించారు. పోలీసులకు భయపడి తాను ఎక్కడికి పారిపోయే ప్రసక్తేలేదని, వీలును బట్టి హాజరవుతానని తన న్యాయవాదుల ద్వారా పోలీసులకు కబురు పంపించినా వారు దురుద్దేశంతో చెన్నైలోని తన నివాసం వద్ద గొడవలకు పాల్పడ్డారని ఆరోపించారు.

సమాచార దర్శిని

ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో రెస్టారెంట్లు

పెరంబూర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై, విరుదాచలం సహా ఐదు రైల్వేస్టేషన్లలో ప్రైవేటు భాగస్వామ్యంతో ఐఆర్‌సీటీసీ రెస్టారెంట్లు ఏర్పాటుచేయనుంది. దక్షిణ రైల్వే పరిధిలో తిరువణ్ణామలై, విరుదాచలం, నగరంలోని మైలాపూర్, వేళచ్చేరి, సెయింట్ థామస్ మౌంట్‌లో రెస్టారెంట్ల ఏర్పాటుకు ప్రైవేటు సంస్థల నుంచి టెండర్లు ఆహ్వానించింది. త్వరలో సంస్థను ఎంపిక చేసి రెస్టారెంట్లు ప్రారంభించనున్నట్లు ఐఆర్‌సీటీసీ అధికారులు తెలిపారు.

వడదెబ్బ బాధితులకు మెరుగైన చికిత్స

పెరంబూర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): వడదెబ్బ బాధితులకు మెరుగైన చికిత్స అందించేందుకు ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఆరోగ్యశాఖ సూచించింది. ఈ మేరకు ఆరోగ్యశాఖ డైరెక్టరేట్ విడుదల చేసిన ప్రకటనలో... వేసవి తాపాన్ని ఎదుర్కొనేలా అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు నిల్వచేసుకోవాలని సూచించామన్నారు. వ్యాక్సిన్‌లు తక్కువ ఉష్ణోగ్రతలో నిల్వ ఉంచాలని, వడదెబ్బ బాధితులకు సంబంధించిన వివరాలు ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించినట్లు ఆరోగ్యశాఖ తెలిపింది.

రాబందుల గణన ప్రారంభం

పెరంబూర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాబందుల గణన గురు, శుక్రవారాల్లో చేపట్టనున్నట్లు అటవీ శాఖ తెలియజేసింది. రాష్ట్రవ్యాప్తంగా 33 ప్రాంతాల్లో చేపట్టనున్న గణనలో అటవీశాఖ సిబ్బంది, రాబందుల నిపుణులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు, వాలంటీర్లు మొత్తం 220 మంది పాల్గొననున్నారు. రాష్ట్రంలో పరిరక్షణ పనుల కారణంగా తెల్ల రాబందుల సంఖ్య పెరిగిందని, ప్రస్తుతం వాటి సంఖ్య, చేపట్టాల్సిన భద్రతా అంశాలు ఈ సర్వే ద్వారా చేపడతామని అధికారులు తెలిపారు.

జీహెచ్ సిబ్బందికి 'బయోమెట్రిక్' తప్పనిసరి

పెరంబూర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రుల్లో పనిచేసే ఉద్యోగులకు 'బయోమెట్రిక్' తప్పనిసరి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రులు, జిల్లా ప్రధాన ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మొత్తం 13,211 ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యుల నుంచి డ్రైవర్ల వరకు అన్ని విభాగాల ఉద్యోగులకు మార్చి 1నుంచి బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి చేస్తూ వైద్య పనుల డైరెక్టరేట్ ఉత్తర్వులు జారీచేసింది. ఇందుకోసం జిల్లాల వారీగా ఐటీ కో-ఆర్డినేటర్లను నియమించారు. ఉద్యోగులు తమ మొబైల్ ఫోన్‌లో బయోమెట్రిక్ యాప్ డౌన్‌లోడ్ చేసుకొని, నిర్ణీత సమయంలో 'ఫేస్ ఐడీ' ద్వారా తాము పని చేసే ప్రాంతం నుంచి రోజువారీ హాజరు నమోదుచేసుకోవాలి. సెలవు, గైర్హాజరు, ఇతర కారణాలతో ఆస్పత్రులకు రాని వైద్యుల వివరాలు వైద్య పనుల డైరెక్టరేట్‌కు ప్రతిరోజు ఉదయం 8 గంటలకు అప్‌డేట్ చేయాలని ఉత్తర్వులో పేర్కొన్నారు.

రూ.2,172 కోట్లతో మధురాంతకం జలాశయ పునరుద్ధరణ

పెరంబూర్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి):చెంగల్పట్టు జిల్లాలో అతిపెద్ద నీటి వనరుల్లో మధురాంతకం జలాశయం ప్రధానమైనది. 1,058హెక్టార్లలో ఉన్న ఈ జలాశయాన్ని 1798 బ్రిటిష్ పాలనలో అప్పటి కలెక్టర్ లియోనెల్ బ్లేజ్ చివరిసారి పునరుద్ధరించారు.ఈ జలాశయం పునరుద్ధరించి నీటి నిల్వలు పెంచాలని నిర్ణయించి రూ.2,172 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. 2022 జూన్‌లో ప్రారంభమైన పునరుద్ధరణ పనులు 80 శాతం ముగిశాయని, జూలైలోగా పనులు పూర్తవుతాయని జలవనరుల శాఖ అధికారులు తెలిపారు.

ఫార్మాసిస్ట్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రుల్లో ఖాళీగా ఉన్న 425 ఫార్మాసిస్ట్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చని వైద్య ఉద్యోగుల ఎంపిక బోరు (ఎమ్మార్బీ) ఒక ప్రకటనలో తెలియజేసింది. ఈ మేరకు ఎమ్మార్బీ విడుదల చేసిన ప్రకటనలో... ఆసక్తి కలిగిన అభ్యర్థులు www.mrb.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో మార్చి 10వ తేదిలోగా దరఖాస్తు చేసుకోవాలి. గంట తమిళ భాషా ఆప్టిట్యూడ్ పరీక్ష (10వ తరగతి సిలబస్ ఆధారంగా), 2 గంటల కంప్యూటర్ ఆధారిత పరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. పరీక్ష తేదీ త్వరలో ప్రకటిస్తారు. దరఖాస్తు చేసుకొనే ఎస్సీ, ఎస్టీ విభాగాల వారు రూ.500, ఇతరులకు రూ.1,000 ఫీజు చెల్లించాలి. వయోపరిమితి, అర్హత, వేతనం, ఆన్‌లైన్ దరఖాస్తు విధానం తదితరాలను ఎమ్మార్బీ వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చు.

సరుకుల ఎగుమతుల్లో చెన్నై హార్బర్ సరికొత్తరికార్డు

ప్యారీస్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): చెన్నై హార్బర్ రోజుకు 2లక్షల టన్నులమేర వరుసగా నాలుగు రోజుల పాటు సరుకులు ఎగుమితి చేసి రికార్డు సృష్టించింది. ఆ ప్రకారం, ఈ నెల 20వ తేది 2.06 లక్షల టన్నులు, 21న 2.31 లక్షల టన్నులు, 22న 2.46 లక్షల టన్నులు, 23వ తేది 2.31 లక్షల టన్నుల సరుకులు ఎగుమతి చేశారు. వీటిలో ఆటోమొబైల్ ఎగుమతులు రెండింతలు పెరిగాయి. ఈ నెల 22వ తేది ఎంవీ గ్రాండ్ హీరో, ఎంవీ గ్రాండ్ మార్క్ తదితర నౌకల ద్వారా ఆటోమొబైల్ వస్తువులు ఎగుమతి చేశారు. అలాగే, ఈ నెల 20వ తేది 6,256 ట్రైలర్లు ఎగుమతి చేశారు. అంతకు ముందు, అత్యధికంగా 2023 జూన్ 1వ తేది 6,087 ట్రైలర్లు ఎగుమతి చేసినట్లు చెన్నై హార్బర్ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ రికార్డు నెలకొల్పేందుకు సహకరించిన హార్బర్ అధికారులు, ఉద్యోగులు, కార్పొరేట్ సంస్థల ప్రతినిధులను చెన్నై హార్బర్ అధ్యక్షుడు సునీల్ పాలివాల్ అభినందించారు.

కేంద్ర విద్యాశాఖ మంత్రి పర్యటన రద్దు

పెరంబూర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాష్ట్ర పర్యటన హఠాత్తుగా రద్దయింది. చెన్నై ఐఐటీలో జరిగే కార్యక్రమంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ పాల్గొంటున్నట్లు ప్రకటన వెలువడింది. ఈ నేపథ్యంలో, నూతన జాతీయ విద్యా విధానం అంగీకరిస్తేనే తమిళనాడుకు నిధులు ఇస్తామని కేంద్ర మంత్రి వ్యాఖ్యలపై డీఎంకే, కూటమి పార్టీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. రాజ్యాంగానికి విరుద్ధంగా మాట్లాడిన కేంద్ర మంత్రి బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నాయి. అదే సమయంలో, నూతన జాతీయ విద్యా విధానానికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో, చెన్నై ఐఐటీలో జరిగే కార్యక్రమానికి కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ హాజరుకావడం లేదని, ఆయనకు బదులుగా కేంద్ర సహాయ మంత్రి సుగంధ మజుందార్ పాల్గొంటారని ప్రకటన వెలువడింది.

పంచాయతీల్లో దివ్యాంగులకు ప్రాధాన్యం

● కొళత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి ప్రారంభోత్సవంలో సీఎం స్టాలిన్


పెరియార్ ప్రభుత్వ ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి

ప్యారీస్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పంచాయితీల్లో దివ్యాంగులకు ప్రాధాన్యత కల్పించనున్నట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ పేర్కొన్నారు. కొళత్తూరు నియోజకవర్గంలో రూ.210కోట్లతో నిర్మించిన పెరియార్ ప్రభుత్వ ఆస్పత్రిని గురువారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ప్రసంగిస్తూ నాన్ ముదల్వన్ పథకం ద్వారా 2.60లక్షల మంది ఉద్యోగ అవకాశాలు పొందారని, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు పెంచేలా ప్రభుత్వం తరుపున స్వచ్ఛంద సంస్థల ద్వారా జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్తర చెన్నై ప్రజల కోసం పెరియార్ ప్రభుత్వ ఆస్పత్రి పనిచేస్తుందని వివరించారు. స్థానిక సంస్థల్లో దివ్యాంగులకు తగిన ప్రాతినిథ్యం కల్పించే విధంగా రానున్న శాసనసభ సమావేశాల్లో చట్ట సవరణ బిల్లు ప్రవేశపెట్టనున్నట్లు సీఎం తెలిపారు. ఆ చట్ట సవరణ ప్రకారం దివ్యాంగులు ఎన్నికలతో నిమిత్తం లేకుండా సభ్యులుగా నియమితులవుతారని ఆయన వెల్లడించారు. ఆరంతస్తుల ఈ ఆస్పత్రిలో 20పడకలతో అత్యవసర చికిత్సా విభాగం, ఎమ్మారై స్కానింగ్, అవుట్ పేషెంట్ విభాగం, ప్రసూతి విభాగం, బ్లడ్ బ్యాంక్, మహిళలు, చిన్నారుల చికిత్స విభాగాలు, గుండె సంబంధిత విభాగం, శస్త్ర చికిత్స, చర్మవ్యాధుల చికిత్స, కేన్సర్ తదితర విభాగాలతో కలిపి మొత్తం 260 పడకలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఏవీ వేలు, ఎం. సుబ్రమణ్యం, పీకే శేఖర్‌బాబు, మేయర్ ఆర్ ప్రియా, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక కోర్టు ఉత్తర్వులపై స్టే విధించలేం

● మంత్రి సెంథిల్ బాలాజీ కేసు

● మద్రాస్ హైకోర్టు

ప్యారీస్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మంత్రి సెంథిల్ బాలాజీకి వ్యతిరేకంగా దాఖలైన కేసులో ప్రత్యేక కోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై స్టే విధించలేమని మద్రాస్ హైకోర్టు తేల్చిచెప్పింది. దివంగత ముఖ్యమంత్రి జయలలిత నేతృత్వంలోని అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో 2011నుండి 2015వ సంవత్సరం వరకు రవాణా శాఖా మంత్రిగా సెంథిల్ బాలాజీ వ్యవహరించారు. ఆ సమయంలో ఆ శాఖలో అసిస్టెంట్ ఇంజనీర్లు, సహాయకులు, డ్రైవర్, కండక్టర్ తదితర పోస్టులకు పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకుని ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంలో కేంద్ర ఆర్థిక నేరవిభాగం సెంథిల్ బాలాజీపై కేసు నమోదు చేయగా, ఈ కేసు రద్దు చేయాలని కోరుతూ, దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపిన మద్రాస్ హైకోర్టు ఉన్నత విచారణకు ఉత్తర్వులు జారీచేసింది. అదే విధంగా సుప్రీంకోర్టు కూడా సమగ్రమైన విచారణ జరపాలని ఆదేశించింది. ఆ మేరకు విచారణ జరిపిన ఈడీ సెంథిల్ బాలాజీ సహా ఈ కేసులో సంబంధాలున్న 2వేల మందికి వ్యతిరేకంగా అదనపు చార్జిషీటు దాఖలు చేశారు. అదనంగా దాఖలు చేసిన చార్జిషీటులను కలిపి ఒకే కేసుగా పరిగణించి విచారణ జరపాలంటూ ఎంపీ, ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా దాఖలయ్యే కేసులు విచారణ జరుపుతున్న ప్రత్యేక న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఉత్తర్వులకు స్టే విధించాలని కోరుతూ, అవినీతి వ్యతిరేక సంస్థ తరుపున మద్రాస్ హైకోర్టులో కొత్తగా పిటిషన్ దాఖలైంది. గురువారం న్యాయమూర్తి ఇళంద్రియన్ ముందు ఈ కేసు విచారణకు రాగా, పిటిషనర్ల న్యాయవాదులు హాజరై వాదించారు. ఈ వాదనలు విన్న అనంతరం అదనపు చార్జిషీట్లను ఒకే కేసుగా పరిగణించాలని ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వులకు స్టే విధించలేమని న్యాయమూర్తి ఇళంద్రిమన్ తేల్చిచెప్పారు. అంతేకాకుండా మంత్రి సెంథిల్ బాలాజీ కేసులో మార్చి 13వ తేదీలోపు కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయవల్సిందిగా పోలీసు శాఖకు ఆదేశించి అదే తేదీకి విచారణ వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

శ్రీకాళహస్తీశ్వరుడి సేవలో రామేశ్వరం ఎమ్మెల్యే


ఆలయం వద్ద రామేశ్వరం ఎమ్మెల్యే ముత్తు రామలింగం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని గురువారం తమిళనాడు రాష్ట్రం రామేశ్వరం ఎమ్మెల్యే ముత్తు రామలింగం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయేశ్వర సన్నిధి వద్ద వేద పండితులు ఆశీర్వదించి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పక్షులు, జంతువుల పెంచేందుకు ఫీజు

● మదురై కార్పొరేషన్ సమావేశంలో తీర్మానం

పెరంబూర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఇళ్లలో పక్షులు, జంతువులను పెంచేందుకు ఫీజు నిర్ణయించడంపై ప్రజలు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. మదురై కార్పొరేషన్ సమావేశాల్లో పలు తీర్మానాలు నెరవేర్చారు. అందులో ఇళ్లలో పక్షులు, జంతువులు సంరక్షిస్తే ఫీజు చెల్లించాలనే తీర్మానం ఒకటి. తీర్మానం మేరకు... ఆవు, గేదెకు రూ.500, గుర్రానికి రూ.750, మేకకు రూ.150, పందికి రూ.500 ఫీజుగా నిర్ణయించారు. అలాగే, శునకం, పిల్లి తదితరాలకు రూ.750 ఫీజు చెల్లించాల్సి ఉంది. సమావేశంలో ఈ తీర్మానం నెరవేర్చినా, ఎప్పటి నుంచి అమలుకు రానున్నదని త్వరలో ప్రకటించనున్నట్లు అధికారులు తెలిపారు.

'గ్రామీణ ఆప్టిట్యూడ్ పరీక్ష' కీ విడుదల

పెరంబూర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించేలా రాష్ట్ర ప్రభుత్వం 'గ్రామీణ ఆప్టిట్యూడ్' పరీక్ష నిర్వహిస్తోంది. 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్షకు అర్హులు. పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారిలో జిల్లాకు 50 మంది చొప్పున ఎంపిక చేసి, 9వ తరగతి నుంచి నాలుగు సంవత్సరాలు నెలకు రూ.1,000 చొప్పున అందజేస్తుంటారు. ఈ పరీక్ష ఈ నెల 8వ తేది నిర్వహించగా, 88 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పరీక్ష కీ ఆన్సర్ www.dge.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో విడుదల చేసినట్లు, సమాధానాల్లో ఏవైనా ఆక్షేపణలు ఉంటే తగిన ఆధారాలతో dgedcection@gmail.com అనే ఈ-మెయిల్‌లో మార్చి 5వ తేదిలోపు తెలియజేయాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

వినతులపై తక్షణ చర్యలు చేపట్టండి

● అధికారులకు కలెక్టర్ ఆదేశం

తిరుత్తణి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను అధికారులకు తెలియజేసేందుకు ప్రజలు ఇచ్చే వినతిపత్రాలను కేవలం కాగితాలుగా భావించరాదని, అవి వారి జీవితాలను మార్చే పత్రాలుగా భావించి అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించాలని కలెక్టర్ ప్రతాప్ అధికారులకు సూచించారు. తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సమీపంలోని కేజీ కండ్రిగైలో డీఎంకే ఆధ్వర్యంలో గురువారం ఉదయం ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రజల నుండి వినతిపత్రాలను తీసుకున్నారు. అనంతరం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఎస్.చంద్రన్‌తో కలిసి సుమారు 335మంది లబ్ధిదారులకు ప్రభుత్వ సహాయాలు, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతాప్ మాట్లాడుతూ శ్రద్ధతో పనిచేస్తే ప్రజలకు అందాల్సిన సహాయాలు సకాలంలో అందించిన వారిమవతామని ఆయన అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో దీప, తహసీల్దార్ మలర్‌విళి, డీఎంకే మండల కార్యదర్శి రాజేంద్రన్ సహా పలువురు ఉన్నతాధికారులు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

వేడి నూనెలో అప్పం కాల్చిన వృద్ధురాలు



అడయార్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని 96 యేళ్ల వృద్ధురాలు సలసల కాగే నూనెలో చేతితో అప్పం కాల్చారు. ఆ అప్పాలను అమ్మవారికి నైవేద్యంగా మర్పించారు. విరుదునగర్ జిల్లా శ్రీవిల్లిపుత్తూరు, వ ు ుద లియ ార ్ పట్టి వీధిలో ఉన్న భద్రకాళి అమ్మన్ ఆలయంలో ప్రతి యేటా మహా శివరాత్రి వేడుకలు నిర్వహిస్తుంటారు. ఈ వేడుకలను పురస్కరించుకుని, ఊరణిపట్టి వీధికి చెందిన 96 యేళ్ల ముత్తమ్మాళ్ వేడి నూనెలో చేతితో అప్పాలు కాలుస్తాంటారు. ఈ యేడాది కూడా అదేవిధంగా కాల్చి అమ్మవారికి నైవేద్యంగా పెట్టి, ఆ తర్వాత భక్తులకు ప్రసాదంగా అందజేశారు. గురువారం వేకువజామున 4 గంటలకు భక్తిశ్రద్ధలతో పూజ చేసి అప్పాలు కాల్చడం ప్రారంభించి, గంటపాటు చేశారు. ఆ సమయంలో ఆలయానికి వచ్చిన కొందరు భక్తులు ఆమెకు పాదాభివందనం చేసి, ఆశీస్సులు తీసుకున్నారు.

నేడు కేంద్రమంత్రికి నల్లజెండాలతో నిరసన

పెరంబూర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెన్నై వీఐటీలో శుక్రవారం జరుగనున్న కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి సుగంధ మజుందార్ పాల్గొననున్నారు. ఈ కార్యక్రమానికి హాజరుకానున్న కేంద్ర మంత్రికి నల్లజెండాలతో నిరసన తెలుపనున్నట్లు డీఎంకే విద్యార్థి విభాగం కార్యదర్శి ఎళిలరసన్ తెలిపారు. రాష్ట్రానికి విద్యా నిధులు అందించేందుకు నిరాకరిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆయన గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

తిరుక్కళికుండ్రంలో అన్నాడీఎంకే ధర్నా


● మాజీ మంత్రి జయకుమార్ సహా 200 మంది అరెస్టు


ధర్నాలో పాల్గొన్న జయకుమార్ తదితరులు

చెన్నై, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పార్టీ నాయకుడిపై జరిగిన హత్యాయత్నాన్ని ఖండిస్తూ తిరుక్కళికుండ్రంలో గురువారం ఉదయం అన్నాడీఎంకే నాయకుడు, మాజీ మంత్రి డి.జయకుమార్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తిరుక్కళికుండ్రం ప్రాంతానికి చెందిన దినేష్‌కుమార్ అన్నాడీఎంకే స్థానిక కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. రెండు రోజుల క్రితం ఇంటి ముందు మద్యం తాగి గొడవపడుతున్న వ్యక్తులపై దినేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ దుండగులు దినేశ్‌కుమార్ ఇంటికి వెళ్లి దినేశ్, ఆయన బంధువుపై వేటకొడవళ్లతో దాడిచేసి పారిపోయారు. తీవ్రంగా గాయపడిన దినేష్‌కుమార్ చెంగల్పట్టు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ దాడి సంఘటనకు సంబంధించి వినోద్, శంకర్ అనే వారిని పోలీసులు అరెస్టు చేశారు. దినేష్‌కుమార్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ తిరుక్కళికుండ్రం బస్‌స్టేషన్ వద్ద గురువారం ఉదయం పోలీసుల అనుమతి లేకుండా అన్నాడీఎంకే ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ధర్నాలో జయకుమార్ మాట్లాడుతూ డీఎంకే అధికారంలోకి వచ్చాక దాడులు, హత్యాయత్నాలు, పెరిగిపోయాయని, ప్రధాన ప్రతిపక్ష అన్నాడీఎంకే స్థానిక నాయకులను టార్గెట్ చేసుకుని కిరాయి గూండాలతో దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. ఆ ప్రాంతంలో ట్రాఫిక్ స్తంభించింది. దీంతో పోలీసులు జోక్యం చేసుకుని మాజీ మంత్రి జయకుమార్, ఎమ్మెల్యే కుమారవేల్, మాజీ ఎమ్మెల్యే తండరై మనోహరన్, చెంగల్పట్టు జిల్లా కార్యదర్శి ఆరుముగం సహా సుమారు 200 మంది కార్యకర్తలను అరెస్టు చేసి, వ్యాన్లలో తరలించారు.

యువత చదువులో రాణించాలి

ఐటీ డిప్యూటీ కమిషనర్ రత్నరాజు ● ఘనంగా మాస్ వ్యవస్థాపక దినోత్సవం


విద్యార్థులతో డాక్టర్ కొల్లి రాజు, రత్నరాజు, ఆత్మకూరి హజరత్తయ్య తదితరులు

ప్యారీస్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): యువత చదువులో రాణించి ఉన్నతంగా ఎదిగి సమాజాభివృద్ధికి కృషిచేయాలని చెన్నై ఇన్‌కమ్‌టాక్స్ డిప్యూటీ కమిషనర్ రత్నరాజు వీసా సూచించారు. మద్రాస్ ఆదిఆంధ్ర అరుంధతీయ ఆదివాసి సంక్షేమ సంఘం (మాస్) 29వ వ్యవస్థాపక దినోత్సవం నగరంలో బుధవారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఎగ్మోర్‌లోని ఇస్కా సెంటర్‌లోని జీవనజ్యోతి హాలులో మాస్ అధ్యక్షుడు డాక్టర్ కొల్లి రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం, మాస్ వ్యవస్థాపకులు దివంగత కేజీ గోపాలకృష్ణ, బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు నివాళులర్పించి ప్రారంభించారు. ముఖ్యఅతిథి రత్నరాజు వీసా 75మంది విద్యార్థులకు ఆర్ఆర్‌బీ ఎగ్జామినేషన్ గైడ్ అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ, బడుగు, బలహీన వర్గాలకు చెందిన కుటుంబాలు ఆర్థికంగా, విద్యా పరంగా ఎదగాలన్న ఉన్నతాశయంతో దివంగత ఐపీఎస్ అధికారి కేజీ గోపాలకృష్ణ స్థాపించిన మాస్ 29ఏళ్ళుగా సమాజానికి అందిస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. అలాగే విశిష్ట అతిథి తమిళనాడు ప్రభుత్వ లా డిపార్ట్‌మెంట్ అడిషనల్ సెక్రటరీ జీసీ నాగూర్ తమ కుటుంబ పెద్దల పేరుతో ముగ్గురు లా విద్యార్థులకు రూ.10వేలు విరాళం అందించారు. పలు రంగాలకు చెందిన ప్రముఖులు డి.విజయ్ అనిల్‌కుమార్, కె.ఎలిలన్, మనోజ్ గడ్డం, గుడిమెట్ల చెన్నయ్య, ఓ.జానకీరామ్, కె.కన్నియప్పన్, ఎం.ప్రభు, ఎం.వీరయ్య తదితరులతో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులు, సంఘ సభ్యులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మాస్ ప్రధాన కార్యదర్శి ఆత్మకూరి హజరత్తయ్య ఆహ్వానంతో ప్రారంభమైన ఈ కార్యక్రమం ఉపాధ్యక్షులు నూనె శ్రీనివాసులు వందన సమర్పణతో ముగిసింది.

7న రాష్ట్రానికి అమిత్ షా



అడయార్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక అరక్కోణం సమీపంలోని కేంద్ర సాయుధ దళం విభాగం సీఆర్‌పీఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా మార్చి 7వ తేదీ రాష్ట్రానికి రానున్నారు. దేశంలో ఒరిశా, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, తమిళనాడు (అరక్కోణం) రాష్ట్రాల్లో సీఆర్‌పీఎఫ్ శిక్షణా కేంద్రాలున్నాయి. రాణిపేట జిల్లాలోని అరక్కోణంలో ఈ శిక్షణా కేంద్రంలో ఉంది. ఈ కేంద్రంలో ప్రతియేటా మార్చి 10వ తేదీ సీఆర్‌పీఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహిస్తుంటారు. ఈ వేడుకల్లో పాల్గొనేందుకు మార్చి 7వ తేదీ అమిత్ షా రాష్ట్రానికి రానున్నాయి.

ఎయిర్‌పోర్టు వద్ద హజ్ హౌస్

అడయార్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెన్నై విమానాశ్రయం వద్ద హజ్ హౌస్‌ను ప్రారంభించనున్నటట్టు ఇండియన్ హజ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అబుబాకర్ వెల్లడించారు. ఈ విషయంపై ఆయన గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తొలిసారి తమిళనాడు రాష్ట్రంలో హజ్ హౌస్ నిర్మించేందుకు ప్రభుత్వం స్థలాన్ని కేటాయించిందన్నారు. ఈ స్థలం కొత్త ఎయిర్‌పోర్టు, పాత విమానాశ్రయానికి మధ్యలో ఉందని తెలిపారు. అంతేకాకుండా, ఈ యేడాది పవిత్ర హజ్ యాత్రకు వెళ్ళే భక్తులకు ఒక్కొక్కరికి రూ.25 వేలు ఇచ్చేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చిందని వెల్లడించారు.

అమీర్ ఖాతాలో డబ్బు జమ చేసిన సాధిక్

● నిర్ధారించిన ఈడీ

అడయార్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): సినీ దర్శకుడు అమీర్ బ్యాంకు ఖాతాల్లో డ్రగ్స్ అక్రమ రవాణా కేసు నిందితుడైన జాఫర్ సాదిక్ డబ్బులు జమ చేసినట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు నిర్ధారించారు. ఈ మేరకు వారు తగిన ఆధారాలను సేకరించారు. పైగా జాఫర్ సాదిక్ అధికార డీఎంకే నేత కావడంతో ఆయనకు బెయిల్ మంజూరు చేస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని కోర్టుకు ఈడీ తెలిపింది. అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాతో కలిసి జాఫర్ సాదిక్ కొన్నేళ్ళుగా వ్యాపారం చేస్తున్నట్టు గుర్తించారు. అందువల్ల ఆయనకు బెయిల్ మంజూరు చేయవద్దని మద్రాస్ హైకోర్టులో కౌంటర్ పిటిషన్ దాఖలు చేసింది. డ్రగ్స్ కేసులో సినీ నిర్మాత అయిన జాఫర్ సాదిక్‌ను ఈడీ అధికారులు అరెస్టు చేయగా, ఆయన ప్రస్తుతం జైలులో ఉన్నారు. ఈ కేసులో బెయిల్ కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఈడీ అధికారులు మాత్రం బెయిల్ మంజూరు చేయొద్దని కోరారు.

వింత దొంగలు !

● 'రోడ్ రోలర్' చోరీ


చోరీ కేసులో పోలీసుల అదుపులో నిందితులు

పెరంబూర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మరమ్మతులకు గురై రోడ్డు పక్కన నిలిపిన రోడ్ రోలర్‌ను ఎత్తుకెళ్లిన ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. షెనాయ్ నగర్‌కు చెందిన దినకరన్, రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్న సంస్థలో ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. ఈ సంస్థకు చెందిన రోడ్ రోలర్‌ను, మీంజూరు ప్రాంతంలో రోడ్డు నిర్మాణపనులకు వినియోగించారు. పనులు ముగిసిన తర్వాత సెప్టెంబరు 15వ తేది రోడ్ రోలర్‌ను మళ్లీ నగరానికి తీసుకొస్తున్న సమయంలో, మీంజూరు-వండలూరు బైపాస్ రోడ్డులోని చోళవరం టోల్ ప్లాజా సమీపంలో హఠాత్తుగా మరమ్మతులకు గురైంది. దీంతో డ్రైవర్, రోడ్డు పక్కనే దానిని నిలిపి వెళ్లిపోయాడు. కొద్ది నెలలుగా ఆ ప్రాంతంలో ఉన్న రోడ్ రోలర్‌కు మరమ్మతులు చేపట్టేందుకు దినకరన్ ఈ నెల 24న మెకానిక్‌తో ఆ ప్రాంతానికి వెళ్లగా వాహనం లేకపోవడం గమనించి దిగ్భ్రాంతి చెందాడు. ఈ వ్యవహారంపై దినకరన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చోళవరం పోలీసులు విచారణ చేపట్టారు. టోల్ ప్లాజా, రెడ్ హిల్స్ రోడ్డు ప్రాంతాల్లోని సీసీ పుటేజీ ఆధారంగా లారీలో రోడ్ రోలర్ తీసుకెళ్తున్న దృశ్యాలు నమోదయ్యాయి. లారీ రిజిస్ట్రేషన్ నెంబరు ఆధారంగా తిరువళ్లూర్ సమీపం పుల్లారంబాక్కం ప్రాంతానికి చెందిన అలెక్స్, గోపినాద్, వెంకటేశన్ లను అరెస్ట్ చేశారు. పలు నెలలుగా రోడ్డు పక్కనే రోడ్ రోలర్ ఉండడాన్ని గమనించినఆ ముగ్గురు క్రేన్ సాయంతో రోడ్ రోలర్‌ను లారీలో ఎక్కించి తీసుకెళ్లినట్లు విచారణలో తెలియగా, వారిచ్చిన సమాచారంతో లారీ, రోడ్ రోలర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

రోడ్డుపై దొరికిన ఫోన్

పోలీస్‌స్టేషన్‌లో అప్పగించిన విద్యార్థులు


సెల్‌ఫోన్‌ను పోలీస్‌స్టేషన్‌లో అప్పగిస్తున్న విద్యార్థులు ఆకాష్, గోపినాథ్

పెరంబూర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై దొరికిన స్మార్ట్ ఫోన్‌ను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించిన విద్యార్థును పోలీసు అధికారులు, ఉపాధ్యాయులు అభినందించారు. తిరువారూరు జిల్లా మరకడై ప్రాంతంలోని పంచాయతి యూనియన్ ఉన్నత పాఠశాలలో వికాస్, గోపినాథ్ 5వ తరగతి చదువుతున్నారు. బుధవారం వారిద్దరు పాఠశాల నుంచి ఇంటికి వెళ్తుండగా, చిన్న కూతానల్లూర్ సబ్ వే సమీపంలో వారికి ఆండ్రాయిడ్ ఫోన్ కనిపించింది. ఆ ఫోన్ తీసుకొని చుట్టూ ఎవరూ లేకపోవడంతో, ఇద్దరూ కలసి కూతానల్లూర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సీఐ సెల్విపర్ణియాకు అప్పగించారు. విద్యార్థులను అభినందించిన ఇన్స్‌పెక్టర్, గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వికాస్, గోపినాథ్‌లను అభినందించి, స్కూల్ బ్యాగ్, వాటర్ బాటిళ్లు బహుమతిగా అందజేశారు.

ఆస్పత్రిలో చేరిన మంత్రి కేకేఎస్ఎస్ఆర్

అడయార్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం కారణంగా రాష్ట్ర రెవెన్యూ శాఖామంత్రి కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్ థౌజండ్‌లైట్‌లోని అపోలో ఆస్పత్రిలో చేరారు. 74 యేళ్ళ కేకేఎస్ఎస్ఆర్ అపుడపుడూ సాధారణ వైద్య పరీక్షల కోసం ఆస్పత్రిలో చేరుతుంటారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి ఆకస్మికంగా అస్వస్థతకు గురికావడంతో ఆస్పత్రిలో చేశారు. పరీక్షించిన ప్రత్యేక వైద్య బృందం వివిధ రకాల పరీక్షలు చేసి వైద్యం అందిస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్టు వారు పేర్కొన్నారు.

శ్రీలంక జైలు నుంచి తమిళ జాలర్ల విడుదల


విడుదలైన తమిళ జాలర్లు

ప్యారీస్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక జైలు నుండి విడుదలైన 27మంది తమిళ జాలర్లు గురువారం విమానంలో నగరానికి చేరుకున్నారు. వారిని ఆహ్వానించిన మత్స్యశాఖ అధికారులు వాహనాల్లో వారి సొంతూళ్లకు పంపించారు. రామనాథపురం జిల్లా తంగచ్చి మఠం నుండి 13మంది జాలర్లు డిసెంబరు 23వ తేదీ సాయంత్రం మర బోట్లలో సముద్రంలో చేపల వేటకు వెళ్ళారు. అర్ధరాత్రి సమయంలో అక్కడికి చేరుకున్న శ్రీలంక నావికా దళం అంతర్జాతీయ జలాల్లోకి ప్రవేశించారంటూ వారిని అరెస్టు చేసి పడవలను కూడా స్వాధీనం చేసుకుంది. అదే విధంగా గత జనవరి 26వ తేదీ రామేశ్వరం నుండి మర బోట్లలో వెళ్ళిన 14మంది జాలర్లను కూడా అరెస్టు చేసి, శ్రీలంక కోర్టు ఉత్తర్వుల మేరకు జైలుకు తరలించింది. తమిళ జాలర్ల అరెస్టును ఖండిస్తూ రామనాథపురం జిల్లాలకు చెందిన మత్స్యకారులు సమ్మె బాట పట్టారు. ఈ నేపథ్యంలో, కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల అధికారులు శ్రీలంకలోని భారత దౌత్య అధికారులతో జరిపిన చర్చలు ఫలించాయి. దీంతో బుధవారం రాత్రి జైలు నుండి విడుదలైన 27మంది జాలర్లు విమానం ద్వారా గురువారం నగరానికి చేరుకున్నారు.



'కింగ్‌స్టన్' ఆడియో రిలీజ్ వేడుక


'కింగ్‌స్టన్' మూవీ.. మన ఊరి 'హ్యారీ పోటర్' : జీవీ ప్రకాష్

తమిళ చిత్రజ్యోతి

'కింగ్‌స్టన్' చిత్రం మన ఊరి నేటివిటీకి అనుగుణంగా తెరకెక్కించిన 'హ్యారీ పోటర్' అని సంగీత దర్శకుడు, హీరో జీవీ ప్రకాష్ కుమార్ అన్నారు. జీవీ, దివ్యభారతి జంటగా, కమల్ ప్రకాష్ రచించి దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'కింగ్‌స్టన్'. జీ స్టూడియోస్ సహకారంతో ప్యారలాల్ యూనివర్స్ పిక్చర్స్ పతాకంపై జీవీ ప్రకాష్ కుమార్ నిర్మాతగా నిర్మించిన తొలి చిత్రం. ఇతర పాత్రల్లో చేతన్, అళగమ్ పెరుమాళ్, ఇలంగో కుమరవేల్, సాబుమన్, అంటోనీ, అరుణాచలేశ్వరన్, రాజేష్ బాలచంద్రన్ తదితరులు నటించారు. ఈ చిత్రం ఆడియో, ట్రైలర్ గురువారం నగరంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ దర్శకులు వెట్రిమారన్, పా.రంజిత్, సుధా కొంగర, 'డ్రాగన్' దర్శకుడు అశ్వత్ మారిముత్తు, ప్రముఖ నిర్మాత కలైపులి ఎస్.థాను ముఖ్య అతిథులుగా హాజరై, చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సినిమా హీరో, నిర్మాత జీవీ ప్రకాష్ కుమార్ మాట్లాడుతూ, 'ఇది నా డ్రీమ్ ప్రాజెక్టు. దర్శకుడు కమల్ చెప్పిన కథ బాగా తెరకెక్కించారు. అతి తక్కువ బడ్జెట్‌లో హాలీవుడ్ స్థాయిలో తెరకెక్కించాం. హీరోయిన్ దివ్యభారతితో ఇది రెండో చిత్రం. మా ఇద్దరి కాంబోలో వచ్చిన 'బ్యాచిలర్' మూవీ విజయం సాధించింది. ఇది కూడా విజయం సాధిస్తుందన్న నమ్మకం ఉంది' అన్నారు. హీరోయిన్ దివ్యభారతి మాట్లాడుతూ, 'సీ అడ్వెంచర్ సినిమాలను ఎంకరేజ్ చేస్తేనే భవిష్యత్‌లో మరిన్ని సినిమాలు నిర్మిస్తారు. ఇందులో ఫైట్ సన్నివేశాల్లో కూడా నటించాను' అన్నారు. ముఖ్య అతిథి, దర్శకుడు వెట్రిమారన్ మాట్లాడుతూ, 'జీవీకి సినిమా ఓ ప్యాషన్. ఎలాంటి పరిస్థితుల్లోనూ, ఎలాంటి సమయంలోనైనా పని చేసేందుకు జీవీ ఇష్టపడతారు. ఈ సినిమా కోసం నిర్మించిన సముద్రపు సెట్ చూసి అతి తక్కువ బడ్జెట్‌లో ఇంత అద్భుతంగా సెట్ వేస్తారా? అనే ఆశ్చర్యం కలిగింది. మరో దర్శకుడు పా.రంజిత్ మాట్లాడుతూ, 'ఇటీవలికాలంలో చిన్న బడ్జెట్ చిత్రాలకు ప్రేక్షకులకు ఆదరణ లభిస్తోందన్నారు. అతి తక్కువ బడ్జెట్‌తో వీఎఫ్ఎక్స్ పూర్తి చేయడం హ్యాట్సాఫ్' పేర్కొన్నారు. చిత్ర దర్శకుడు కమల్ ప్రకాష్ మాట్లాడుతూ, 'ఈ అవకాశాన్ని కల్పించిన జీవీ ప్రకాష్‌కు ధన్యవాదాలు. మీడియా కూడా సపోర్టు చేయాలని కోరుతున్నాను' అని పేర్కొన్నారు.

మోహన్ దర్శకత్వంలో 'ద్రౌపది-2'

శివాజీ ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మాత సోలా చక్రవర్తి, జీఎం ఫిల్మ్ కార్పొరేషన్ సంయుక్తంగా మోహన్.జి దర్శకత్వంలో రిచర్డ్ రిషి హీరోగా 'ద్రౌపది-2' మూవీ తెరకెక్కుతుంది. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'ద్రౌపది', 'రుద్రతాండవం' చిత్రాలు ఇటు వాణిజ్యపరంగా, అటు విమర్శకుల ప్రశంసలు అందున్నాయి. ఇపుడు 'ద్రౌపది-2' తెరకెక్కిస్తున్నారు. 14వ శతాబ్దానికి చెందిన కథ తీసుకుని రూపొందిస్తున్నారు. చరిత్ర పుటల్లో కనుమరుగైపోయిన భీకర యోధుల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఈ మూవీ ఫస్ట్‌లుక్, మోషన్ పోస్టర్‌ను రిలీజ్ చేయగా, ఇవి రెండూ సినీ, వ్యాపార వర్గాలను ఎంతగానో ఆకర్షించాయి. ఈ ప్రాజెక్టు వివరాలను దర్శకుడు మోహన్ వివరిస్తూ, 'తమ తదుపరి సినిమా టైటిల్, ఫస్ట్‌లుక్ రిలీజ్ చేయడం సంతోషంగా ఉంది. మార్చిలో షూటింగ్ ప్రారంభించి, ముంబై, హైదరాబాద్, మధ్యప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో ఎంపికచేసిన లోకేషన్లలో చిత్రీకరణ పూర్తిచేసి, ఈ యేడాది ఆఖరునాటికి విడుదల చేయాలని భావిస్తున్నాం. తమిళం, తెలుగు, కన్నడ, హిందీ భాషల్లో ఏకకాలంలో నిర్మించే ఈ చిత్రానికి జిబ్రాన్ సంగీతం సమకూర్చుతున్నారు. ఇందులో నటించే నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే వెల్లడిస్తాం' అని పేర్కొన్నారు.



రిచర్డ్ రిషి

కమ్యూనిస్టుగా సముద్రఖని

● 'వీర వణక్కం' ఫస్ట్‌లుక్



'వీర వణక్కం' ఫస్ట్‌లుక్

మలయాళ దర్శకుడు అనిల్ వి నాగేంద్రన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'వీర వణక్కం' చిత్రంలో ప్రముఖ నటుడు సముద్రఖని కమ్యూనిస్టుగా నటించారు. ఆయనతో కలిసి నటుడు భరత్ తొలిసారి నటించగా, ఈ చిత్రం ఫస్ట్‌లుక్ తాజాగా రిలీజ్ చేశారు. అలాగే, జాతీయ అవార్డు గ్రహీత సురభి ముఖ్య పాత్ర పోషించారు. ప్రముఖ విప్లవ గాయని, కేరళ ప్రజల గౌరవం పొందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు 95 యేళ్ళ బీకే మేదిని అమ్మ మరో కీలక పాత్ర పోషించారు. దర్శకుడు అనిల్ వి నాగేంద్రన్ దర్శకత్వం వహించిన హిట్ మూవీ 'వసంతిండే కనల్ వళిగలిల్' రెండో భాగమే ఈ 'వీర వణక్కం'. ఈ మూవీకి ఎంకే అర్జునన్, పెరంబావూర్ జి.రవీంద్రనాథ్, జేమ్సు వసంతన్, సీజే కుట్టప్పన్, అంజల్ ఉదయకుమార్ అనే ఐదుగురు సంగీత దర్శకులు పనిచేయడం గమనార్హం. దివంగత నేపథ్యగాయకుడు టీఎం సౌందరరాజన్ కుమారుడు టీఎంఎస్ సెల్వకుమార్ ఈ సినిమా ద్వారా తొలిసారి గాయకుడిగా పరిచయమవుతున్నారు.

సంతోషంలో నయన్-శివన్ దంపతులు

హీరోయిన్ నయనతార, దర్శకుడు విఘ్నేష్ శివన్ దంపతులు తెగ ఆనందపడిపోతున్నారు. దీనికి కారణం లేకపోలేదు. దర్శకుడు ప్రదీప్ రంగనాథన్ హీరోగా విఘ్నేష్ శివన్ 'లవ్ ఇన్స్యూరెన్స్ కంపెనీ' (ఎల్ఐసీ) పేరుతో ఓ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఈ ప్రాజెక్టులో నయనతార కూడా ఓ భాగస్వామిగా ఉన్నారు. ఈ క్రమంలో ప్రదీప్ రంగనాథన్ - అనుపమ పరమేశ్వరన్ జంటగా, అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో వచ్చిన తాజా చిత్రం 'డ్రాగన్'. ఇటీవల విడుదలై ఘన విజయం సాధించడంతో బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తుంది. ఈ విజయంతో నయనతార దంపతులను ఎంతో ఆనందానికి గురిచేసింది. ఎందుకంటే ప్రదీప్ రంగనాథన్‌తో తాము చేపట్టిన ప్రాజెక్టు బిజినెస్‌కు 'డ్రాగన్' హిట్ ఎంతగానో దోహదపడుతుందని వారు గట్టిగా నమ్ముతున్నారు. ఈ విజయాన్ని చూపించి తమ చిత్ర వ్యాపారాన్ని మరింతగా పెంచుకోవచ్చనే ఆలోచనలో ఉన్నారు.



నయనతార - విఘ్నేష్ శివన్

వైభవంగా ఆదిదంపతుల కల్యాణం





అక్షయ బాబా మందిరంలో అభిషేకపూజలు నిర్వహిస్తున్న అర్చకులు - గంగా హారతి శివరాత్రి పూజలో అతిథులు, నిర్వాహకులు

ప్యారీస్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా కొరట్టూరు మోహన్ గార్డెన్‌లో బుధవారం రాత్రి శివపార్వతుల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. అఖిల భారత తెలుగు సమాఖ్య (ఏఐటీఎఫ్) ఆధ్వర్యంలో 13వ సంవత్సరం శివపార్వతులకు పూజలు నిర్వహించారు. ఏఐటీఎఫ్ అధ్యక్షులు ఆచార్య సీఎంకే రెడ్డి, డాక్టర్ సీఎం కిషోర్ తదితరులు భక్తులకు తీర్థ అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.



మహాశివరాత్రి పూజలో ఆచార్య సీఎంకే రెడ్డి తదితరులు

మార్, ఎస్వీ పద్మనాభం, సీహెచ్ మల్లిఖార్జునరావు, గౌరవాతిథులుగా పాల్గొన్నారు. మహాకుంభమేళాలో పాల్గొనలేకపోయిన క్లబ్ సభ్యుల కోసం శివరాత్రి సందర్భంగా వేదిక ప్రాంగణంలో మహా కుంభమేళ తీర్థ సెట్టింగ్ ఏర్పాటు చేశారు. శివ పార్వతి స్ఫటిక లింగానికి రుద్రాభిషేకం, బిల్వార్చన పూజలు నిర్వహించారు. చివరగా భక్తులందరికి అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

నేత్రపర్వంగా గంగా హారతి...

వైశ్య గురుసేవా సమితి తమిళనాడు, వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ - వీ502ఏ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీమద్ వామనాశ్రమ స్వామి మంగళశాసనాలతో మహాశివరాత్రి సందర్భంగా గంగా హారతి నేత్రపర్వంగా జరిగింది. షావుకారుపేట వరదాముత్తియప్పన్ వీధిలో వున్న నారాయణ గురవయ్యశెట్టి హాలులో బుధవారం సాయంత్రం 4గంటల నుండి గురువారం తెల్లవారు జాము 3గంటల వరకు గంగా హారతి, కుంభపూజ, శివ పంచాక్షరి, బిల్వాష్టకం, స్వర్ణలింగ రుద్రాభిషేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. క్లబ్ ప్రాజెక్ట్ చైర్‌పర్సన్ భోగనాధం శివకుమార్, సుమ వంశీ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో క్లబ్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు నామా సతీష్‌కుమార్, చారుగుండ్ల వెంకటేశ్వరరావు, జిల్లా గవర్నర్ సీఎం రాజేష్ ముఖ్యఅతిథులుగా, బండారు అనంత పద్మనాభం, ఆర్వీఎల్ రత్నకు

శత రుద్రాభిషేకం...

ఆదిదేవుడైన మహాశివునికి ప్రీతికరమైన 'మహాశివరాత్రి' సందర్భంగా బ్రాడ్‌వే ఆచారప్పన్‌వీధిలో జై వాసవీ చారిటబుల్ ట్రస్ట్ నిర్వహణలోని అక్షయబాబా మందిరంలో విశేషపూజలు నిర్వహించారు. బుధవారం సాయంత్రం 7గంటలకు విఘ్నేశ్వరపూజ, సంకల్పం, అలంకార, శత రుద్రాభిషేకాలను పురోహితులు నిర్వహించారు. బాబా సన్నిధి ముందు మహాశివునికి పంచామృతం, సుగంధద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. రాత్రి 10గంటల నుండి తెల్లవారు జాము వరకు నిర్వహించిన భజనలు, కీర్తనలతో భక్తులు స్వామివారిని సేవించుకున్నారు. ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ అజంతా డాక్టర్ కనిగెలుపుల శంకర్‌రావు నేతృత్వంలో జరిగిన ఈ వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహాదీపారాధన అనంతరం మంగళ హారతులు, మహాప్రసాదం పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు.

చిదంబరంలో 'నాట్యాంజలి' ఉత్సవాలు ప్రారంభం

పెరంబూర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా చిదంబరంలో నాట్యాంజలి ట్రస్ట్ ఆధర్యంలో 44వ వార్షిక 'నాట్యాంజలి' వేడుకలు మహిశివరాత్రి సందర్భంగా బుధవారం ప్రారంభమయ్యాయి. చిదంబరం సౌత్ వీధిలోని వీఎస్ ట్రస్ట్ ప్రాంగణంలో వేడుకలు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ట్రస్ట్ అధ్యక్షులు ముత్తుకుమరన్ అధ్యక్షత వహించగా, కార్యదర్శి సంబంధం, డా.అరుళ్‌మొళి సెల్వన్ పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎన్ఎల్‌సీ చైర్మెన్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ... ఈ వేడుకలు నాట్యానికి సంబంధించినవి మాత్రమే కాకుండా ఆధ్యాత్మికతతో ఉన్నాయన్నారు. మార్చి 2వ తేది వరకు జరిగే ఈ వేడుకల్లో రాష్ట్రంతో పాటు కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా సహా పలు రాష్ట్రాలు, విదేశాలకు చెందిన సుమారు 400 మంది కళాకారులు తమ తమ ప్రాంతాల సంప్రదాయ నత్యాలు ప్రదర్శిస్తారని నిర్వాహకులు తెలిపారు.



భరత నాట్య ప్రదర్శనలో కళాకారులు



చెన్నై, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తంజావూరులోని బృహదీశ్వరాలయంలో శివరాత్రి వేడుకలు నేత్రపర్వంగా జరిగాయి. బుధవారం రాత్రి ఆలయం వద్ద శివజాగరణ చేసేందుకు వేలాదిమంది భక్తులు గుమికూడారు. శివరాత్రి సందర్భంగా ఆవుడయార్ (మహాలింగానికి) వివిధ సుగంధద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. రాత్రి పది గంటల ప్రాంతంలో ఆవుడయార్‌కు ప్రధానార్చకులు పూలతో అలంకరించి, దీపారాధన చేశారు. ఓ వైపు గర్భాలయంలో బుధవారం రాత్రి పది నుండి గురువారం వేకువజాము వరకు ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. గుడి గంటలు మోగుతుండగా, శైవపండితులు శంఖనాదం చేస్తుండగా, బృహదీశ్వరాలయం బయట పచ్చిక బయళ్లపై భక్తులంతా కూర్చుని మహాశివుడి నామ స్మరణ చేశారు. రాత్రంతా ఆలయ ప్రాంగణంలో భక్తులు జాగారం చేస్తూ మహాశివుడిని ఆరాధించారు. ఈ సామూహిక జాగరణ కార్యక్రమంలో పాల్గొనేందుకు రాష్ట్రం నలమూలల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాలైన కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ నుండి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఆ సందర్భంగా ఆలయం వద్ద పటిష్ఠమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేస్తున్న ఆలయ సిబ్బంది

కుమరి, పుదుకోట, తంజావూరు

ఆలయాల మరమ్మతులకు రూ.27 కోట్లు

చెన్నై, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రత్యేక దేవస్థానాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సుప్రసిద్ధ ఆలయాల నిర్వహణ, మరమ్మతులకు ఇచ్చే సబ్సిడీని ప్రభుత్వం ప్రతియేటా పెంచుతోంది. ఆ మేరకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కన్నియాకుమారి, పుదుకోట, తంజావూరు దేవస్థాన ఆలయాలకు సబ్సిడీరూపంలో ఇచ్చే ప్రభుత్వ సహాయాన్ని కూడా పెంచారు. సచివాలయంలో గురువారం ఉదయం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ మూడు దేవస్థానాల ఆలయాల నిర్వహణ, మరమ్మతులకు సబ్సిడీని చెక్కు రూపంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అందజేశారు. కన్నియాకుమారి దేవస్థానం ఆలయాలకు సబ్సిడీని రూ.8 కోట్ల నుండి రూ.13 కోట్లకు పెంచి చెక్కును సుశీంద్రం కన్నియాకుమారి దేవస్థాన ఆలయాల ట్రస్టు బోర్డు సభ్యులు కే రామకృష్ణన్‌కు, పుదుకోట దేవస్థానం ఆలయాలకుగాను రూ.5 కోట్ల నుంచి రూ.8 కోట్లకు పెంచిన సబ్సిడీ చెక్కు ఆ జిల్లాలోని దేవస్థాన ఆలయాల తక్కార్ సహాయ కమిషనర్ వి.సురేష్‌కు అందజేశారు. ఇదే విధంగా తంజావూరు దేవస్థాన ఆలయాలకు రూ.3కోట్ల నుండి రూ.6 కోట్లకు పెంచిన సబ్సిడీ చెక్కు తంజావూరు సంస్థానం పారంపర్య ట్రస్టీ సీ బాబాజీ రాజా బాన్స్‌లేకు ముఖ్యమంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానంద, పర్యాటక దేవాదాయ శాఖ అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కే మణివాసన్, హిందూ దేవాదాయ శాఖ కమిషనర్ పీఎస్ శ్రీధర్, అదనపు కమిషనర్లు డాక్టర్ సీ పళని, ఎన్. తిరుమగళ్ తదితరులు పాల్గొన్నారు.



తంజావూరు దేవస్థానం ఆధ్వర్యంలోని ఆలయాల మరమ్మతులకు రూ.6 కోట్ల చెక్కు అందజేస్తున్న ముఖ్యమంత్రి



విద్యార్థులతో లయన్ తాళ్లూరి సురేష్, పాఠశాల నిర్వాహకులు

ఘనంగా చెన్నై ప్రైమరీ స్కూల్ వార్షికోత్సవం

ప్యారీస్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేఎం కాలనీలోని చెన్నై ప్రైమరీ స్కూల్ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. లయన్స్ క్లబ్ ఆఫ్ చెన్నై రాయల్‌కింగ్స్ వార్షిక ప్రాజెక్ట్‌లో భాగంగా నిర్వహించిన ఈ వేడుకల్లో ముఖ్యఅతిథిగా లయన్ తాళ్లూరి సురేష్ పాల్గొని పాఠశాలకు సౌండ్ సిస్టమ్, వంద కుర్చీలు విరాళంగా అందజేశారు. లయన్స్ క్లబ్ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించి అలరించారు.



సచివాలయంలో సీఎం స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్న మాజీ ఐఏఎస్ అధికారి, ప్రపంచ తమిళ పరిశోధనా సంస్థ నూతన అధ్యక్షుడు ఆర్.బాలకృష్ణన్



మార్చి 16న తన సాహిత్యాలపై జరిగే సదస్సు ఆహ్వాన పత్రికను క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలిసి అందజేస్తున్న ప్రముఖ సినీ గేయరచయిత వైరముత్తు

కోలాహలంగా శ్మశాన కొల్ల జాతర

ప్యారీస్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ట్రిప్లికేన్ నియోజకవర్గ పరిధిలోనా రామ్‌నగర్‌లో శ్మశాన కొల్ల బుధవారం సాయంత్రం కోలాహలంగా జరిగింది. ఈ ప్రాంతంలోవున్న అంకాల పరమేశ్వరి ఆలయంలో మహాశివరాత్రి, అమావాస్య పర్వదినాలను పురస్కరించుకుని వార్షిక శ్మశాన కొల్ల ఉత్సవాలు ప్రారంభమైయ్యాయి. ఇందులో భాగంగా అంకాల పరమేశ్వరి అమ్మవారిని వీధుల్లో ఊరేగించారు. మహాకాళి, దుర్గామాత తదితర దేవతా మూర్తుల వేషధారణతో భక్తులు నాట్యం చేస్తూ సందడి చేశారు. కాగా, అమ్మవారి ఊరేగింపు కారణంగా ఐస్‌హౌస్ ప్రాంతంలో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగకుండా పోలీసులు ప్రత్యమ్నాయ చర్యలు చేపట్టారు.



అంకాల పరమేశ్వరి అమ్మవారి ఊరేగింపు - అమ్మవారి వేషధారణలో భక్తురాలి విన్యాసాలు